క్లుప్తంగా

నేడు మండల సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి బుధవారం తెలిపారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఈనెల 30న పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి వనంగుడి, చదురుగుడిలలో ఏర్పాటుచేసిన హుండీల ఆదాయాన్ని ఈనెల 30వతేదీన లెక్కించనున్నట్లు ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు రెవెన్యూ, పోలీస్‌శాఖ, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


గలావల్లిలో షిర్డీసాయి ఆలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాలినాయుడు మాస్టారు

బలిజిపేట: మండలంలోని గలావల్లి గ్రామంలో షిర్డీసాయి ఆలయం వద్ద రూ.25వేలతో కూలింగ్ వాటర్ సరఫరా చేసే చలివేంద్రాన్ని రిటైర్డ్ ఎంటీఎస్ ఉపాధ్యాయుడు కె.దాలినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కరుణా కటాక్షాలతో, ఆలయానికి వచ్చే రాబడితోనే దీనిని ఏర్పాటుచేశామని తెలిపారు. నిరంతరం ఈ చలివేంద్రం ఉంటుందని, ప్రజలు వారి దాహార్తిని తీర్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం


జవాన్‌ను సన్మానిస్తున్న సంజీవినాయుడు, యువకులు

బలిజిపేట: మెరకముడిదాం మండలం గాదెల మర్రివలస గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఏవీ నాయుడును పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు ఘనంగా సన్మానించారు. నేతాజీ గ్రంథాలయం వద్ద బుధవారం ఆయనను సన్మానించిన సందర్భంగా సంజీవినాయుడు మాట్లాడుతూ దేశానికి కిసాన్, జవాన్ చాలా ముఖ్యమన్నారు. అటువంటి జవాన్‌లను గౌరవించడం భరతమాతను గౌరవించినట్టేనన్నారు. ఎన్నో మంచి లక్షణాలు కలిగిన జవాన్ ఏవీ నాయుడు అని ప్రశంసించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత నాయుడు మాట్లాడుతూ ఈ సన్మానం తన ఒక్కడికే కాదని, దేశాన్ని కాపాడుతున్న అందరి జవాన్ల సేవలను గుర్తించి చేసినట్లేనన్నారు. మారుమూల గ్రామంలో జవాన్లపై ఇంతటి ప్రేమాభిమానాలు చూపిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కె.భాస్కర్, పవన్, మధు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతా ర్యాలీని విజయవంతం చేయండి

బలిజిపేట: ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న రెండు కార్యక్రమాలు సమైక్యత ర్యాలీని, తహసీల్దా ర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కమిటీ తీర్మానించింది. ఈ మేరకు బలిజిపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రచార కరపత్రాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ఆర్.వేణు, మన్మథరావులు మాట్లాడుతూ 30న మతసామరస్యం, దేశ సమగ్రతకు సీపీఎం కృషిపై నిర్వహించనున్న సమైక్యతా ర్యాలీ ని విజయవంతం చేయాలని కోరారు. అదేరోజున పార్వతీపురం నుంచి పెద్దింపేట మీదుగా నారాయణపురం బస్సు నడపాలని తహసీల్దార్ కార్యాల యం వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. అలా గే వచ్చేనెల 3వ తేదీన కౌలు రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. వాటిని విజయవంతం చేయాలని, ఉగ్రదా డి చర్యలకు వ్యతిరేకంగా దేశప్రజల ఐక్యత సమైక్యతా స్ఫూర్తికి ఇది నిదర్శనమన్నారు. నేటి టీడీపీ ఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ బీజేపీ మతోన్మాదానికి వంత పాడుతోందని, అటువంటి పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కల్తీ విత్తనాలతో జర జాగ్రత్త!

- విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

నాణ్యమైన విత్తనంతోనే దిగుబడులు



పొలంలో వేసిన విత్తనాలకు మొలకలు రాకపోతే నకిలీ విత్తనాలుగా భావిస్తారు. రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు వహించాలి. నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను వ్యసాయ సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

– ఆర్.విజయభారతి, ఏవో, గరుగుబిల్లి

గరుగుబిల్లి: కొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతులు ఇప్పుడిప్పుడే సాగుకు సమాయత్తం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా కల్తీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టం – 1985 ప్రకారం నిబంధనలు పాటించాల్సి వుంది.

విత్తన కొనుగోలులో..

వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలరు వద్ద, గుర్తింపు పొందిన సంస్థల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. సరిగ్గా సీలు వేసి ధ్రువీకరణ పత్రం వున్న విత్తన బస్తాలనే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచిపై విత్తనం రకం, ల్యాబ్ నంబర్, గడువు తేదీ తదితర విషయాలను గమనించాలి. కొనుగోలు చేసిన బిల్లుపై డీలరు సంతకం ఉండాలి. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. హైబ్రిడ్ విత్తనాలు కొనుగోలు చేసేటపుడు విత్తన రకం, స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యు నాణ్యత వంటి వివరాలను పరిశీలించాలి. మొలకెత్తే దశ, పూత దశలో లోపం కనిపిస్తే స్థానిక వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించాలి.


ఆర్‌ఎస్‌కేలలో పంపిణీకి సిద్ధంగా వున్న విత్తనాలు

'మొలకను పరీక్ష చేసుకోవాలి

రైతులు విత్తుకోవడానికి ఒక రోజు ముందు విత్తనాలను కొనుగోలు చేయడం వల్ల మొలక పరీక్షలు చేయించుకోవడం లేదు. కానీ విత్తనం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా మొలకను పరీక్ష చేయించుకోవాలి. రైతు కొనుగోలు చేసిన విత్తనాల సంచి నుంచి 100 గింజలను 24 గంటల పాటు నీటిలో నానబెట్టి, అనంతరం ఒక గుడ్డలో గాలి, వెలుతురు తగలని ప్రదేశంలో వుంచాలి. 24 గంటల తర్వాత తీసి చూస్తే 100 గింజలకు 75 గింజల పైన మొలక వస్తే మంచి విత్తనంగా నిర్ధారించుకుని, నారుమడి వేసేందుకు సిద్ధం చేసుకోవాలి. మొలక శాతం కనీసం 75 శాతం వరకు ఉంటే విత్తనాలు నాణ్యమైనవని భావించి విత్తుకోవాలి.

బోరి గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలి


బోరి గెడ్డ వద్ద గిరిజనులు నిర్మించిన చెక్కల వంతెనను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం బోరి(బండిగూడ) గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యుడు మండంగి సింగన్న, గుణమ్మ, కౌసల్య తదితరులతో కలిసి గొటివాడ – బోరి గ్రామాల మధ్యనున్న చెక్కల బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గెడ్డపై బ్రిడ్జి లేకపోవడంతో ఈ ప్రాంతంలో నివసించే అనేక గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. దీనిపై బ్రిడ్జి నిర్మిస్తే రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన పాలకొండకు తక్కువ సమయంలో చేరుకునే వీలు ఈ ప్రాంత ప్రజలకు కలుగుతుందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పిన నేతలు మాట తప్పారన్నారు. ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి బోరి గెడ్డపై తక్షణమే బ్రిడ్జి నిర్మించే చర్యలు చేపట్టాలని కోరారు.

సచివాలయ సందర్శన


గెడ్డతిరువాడ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధర్మారావు

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ సచివాలయాన్ని ఎంపీడీవో ధర్మారావు బుధవారం సందర్శించారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలు అందిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని సూచించారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పంచాయితీ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, రికార్డుల నిర్వహణ వంటి విషయాలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.

● సిగ్నల్స్ అందక అవస్థలు..



పై ఫోటోలో కనిపిస్తున్న యువకులు జీడిపిక్కలు ఏరివేతకో, చెట్టు నీడ కోసమే వేచి ఉన్నారనుకుంటే పప్పులో కాలేసినట్టే. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్ సిగ్నల్స్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో, తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ శివారున గల తోటలు, కొండలపైకి వస్తున్నారు. ఇక్కడ అరకొరగా స్నిగల్స్ వస్తుండడంతో మాట్లాడడం.. ఇంటర్నెట్ చూడడం వంటివి చేస్తున్నారు.

– సీతంపేట

● హనుమాన్ చాలీసా..



నగరంలోని దక్షిణ ముఖాంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక కార్యాక్రమాలు కొనసాగుతున్నాయి. హనుమాన్ జయంతిలో భాగంగా బుధవారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అంతకుముందు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మూలవిరాట్‌కు పుష్పాభిషేకం చేశారు.

– పాలకొండ రూరల్

● యోగాపై అవగాహన..



భామిని మండల కేంద్రంలో మండల అధికారులు యోగా విశిష్టతను వివరిస్తూ బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. వైద్యాధికారులు పసుపులేటి సోయల్, సీహెచ్‌ఓ భాస్కరరావు, డీటీ శంకర రాయుడు, మండల పరిషత్, వెలుగు, ఉపాధి శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

– భామిని

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం


నిరుపయోగంగా ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం భవనం

వీరఘట్టం: గతంలో వీరఘట్టం మండలంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టును పాలకొండకు తరలించారు. దీంతో మండల కేంద్రంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ఖాళీగా మారింది. దీంతో పాములకు ఆవాసంగా మారింది. ఈ భవనంలో ఉన్న పాములు తరచూ పక్కనే ఉన్న ఎంఈఓ కార్యాలయం ఆవరణలో సంచరిస్తుండడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఖాళీ భవనాన్ని ఎంఈఓ కార్యాలయానికి అప్పగించాలని పలువురు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

సీతంపేట/ పాలకొండ: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏపీఓ చిన్నబాబుతో పాటు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకొండ నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు

పరామర్శ


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని నాయకమ్మగూడకు చెందిన మోహిత్ అనే విద్యార్థి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని బాలుడి తల్లిదండ్రులను ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు కె.వెంకునాయుడు, తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యులు హరిప్రసాద్, ఎస్.మంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్.మోహన్‌రావు, తవిటిరాజు, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో కుట్టు శిక్షణ లేనట్టేనా..?

సీతంపేట: బీసీ కార్పొరేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడానికి 45 రోజుల కిందట అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అన్ని మండలాల్లో శిక్షణ ప్రారంభం కాగా.. ఇక్కడ మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. శిక్షణ కోసం దాదాపు 35 మంది బీసీ మహిళలు దరఖాస్తులు అందజేశారు.

వీరంతా శిక్షణ ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ బీబీ మిశ్రో వద్ద ప్రస్తావించగా.. శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జలహారతి రేపు

కొమరాడ: జంఝావతి ప్రాజెక్టు పూర్తి స్థాయి సాధన కోసం ఈ నెల 30న జంఝావతి సాధన సమితి ఆధ్వర్యంలో జల హారతి బైక్ ర్యాలీలు పరిసర ప్రాంతాల గ్రామాల్లో గురువారం నిర్వహించనున్నట్లు సమితి కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జంఝావతి ప్రాజెక్టు ఆవరణలో జల హారతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ర్యాలీ పార్వతీపురం నుంచి శివిని, విక్రంపురం, ఆర్తాం, స్వామినాయుడువలస, గంగారేగువలస, రాజ్యలక్ష్మీపురం, కంబవలస, కోనవలస తదితర ప్రాజెక్టు సమీప గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ర్యాలీల్లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంతాపం..

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా పనిచేస్తున్న తూలుగు రమణమూర్తి (55) బుధవారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణమూర్తి మృతి చెందడంపై ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీడీఓ బి.వెంకటరమణ, వీరఘట్టం ఈఓ బి.కోటీశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సంతాపం తెలియజేశారు.

మౌలిక వసతులు కల్పించాలి



పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాలనీలో 1100 మందికి ఇళ్ల పట్టాలు అందించారని తెలిపారు. కనీస వసతులు లేకపోవడంతో కేవలం 50 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయన్నారు. తాగునీటి సరఫరా లేదని, కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉంటోందన్నారు. అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఉపాధి పనులు అందరికీ కల్పించాలి


ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ ధర్మారావు

జియ్యమ్మవలస రూరల్: ఉపాధి హామీ పనులు గ్రామాల్లో అందరికీ కల్పించాలని ఎంపీడీవో కె.ధర్మారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వేతనదారులు సమయపాలన పాటిస్తూ పనులు చేపట్టేలా చూడాలని, మస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, కొలతల మేరకు పనులు చేపట్టేలా చూడాలని సూచించారు. వేతనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో తులసీదాస్, జేఈ తేజ ఉన్నారు.

వేలాది మంది విద్యార్థులకు బాసటగా..


వేణుగోపాలనాయుడు, వేణుగోపాలస్వామి విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

పాలకొండ రూరల్: పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని ముదునూరు వీధిలో గల బెవర వేణుగోపాలనాయుడు అన్నదాన సత్రం గడచిన వందేళ్లుగా వేలాది మంది విద్యార్థులకు బాసటగా నిలిచిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. అన్నదాత సత్రంలో వేణుగోపాలనాయుడు, వేణుగోపాలస్వామి విగ్రహాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... వీరిద్దరూ సత్రం నిర్వహణకు ఎంతో సహకరించారని చెప్పారు. సత్రం నిర్మాణానికి భూమి కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో పాలవసల శశిభూషణరావు, గేదెల రామ్మోహనరావు, గేదెల అప్పలనాయుడు, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిలిండర్ వినియోగంపై అవగాహన తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

వీరఘట్టం: గ్యాస్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు డెలివరీ బాయ్స్ తప్పనిసరిగా ఫైర్ సిలిండర్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం ఇన్‌స్పెక్టర్ జామి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ లీకై ప్రమాదాలు జరిగే సమయంలో ఎలా వ్యవహరించాలో వివరించారు.

ప్రతి నెలా 18వ తేదీ వరకు..


తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: జూన్ ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న రేషన్ దుకాణాలను ప్రతి నెలా 18వ తేదీ వరకు తెరిచి ఉంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 56 చౌకధరల దుకాణాలున్నాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు.. తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. అలాగే దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు ఇంటి వద్ద సరుకులు ఇవ్వాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు పసుపు రంగు


పసుపు రంగులో మండల పరిషత్ కార్యాలయ భవనం

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు రంగులు మార్చుకుంటున్నాయి. భామిని మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయ భవనాలు కొత్తగా పసుపు రంగు పులుముకున్నాయి. అధికారులే స్వయంగా రంగులు మారుస్తున్నరన్న ప్రచారం ఉంది. కూటమి నాయకుల మెప్పు కోసమే రంగులు మారుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

-భామిని


రంగు మారిన వ్యవసాయ కార్యాలయం